


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 641 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాంద్ర శనివారం 17 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

# తిరుపతిలో 'ఏపీ ఫస్ట్' పేరుతో భారీ పరిశోధన కేంద్రం



ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఒక చారిత్రక నిర్ణయం తీసుకుంది. తిరుపతి కేంద్రంగా 'ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' (ఫ్యూ ఫీ×=ూ) పేరుతో రాష్ట్రంలోనే అతిపెద్ద పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (××ు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (××ూజు=) భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని నెలకొల్పనున్నారు.

శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఫస్ట్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని యువతకు, పరిశ్రమలకు మధ్య వారధిగా నిలుస్తూ, భవిష్యత్ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. భవిష్యత్తులో ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటివి అత్యంత కీలక రంగాలుగా మారనున్నాయి. వీటికి అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్‌లకు ఏపీ ఒక వేదికగా నిలవాలని, అందుకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను ఏపీ ఫస్ట్ అందించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రముఖ కంపెనీలు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో ఏపీ ఫస్ట్ అనుసంధానమై పనిచేయాలని సీఎం సూచించారు. "గతంలో ఐటీ, ఫార్మా రంగాలను ప్రోత్సహించడం వల్లే తెలుగువారు ఆ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వచ్చే మూడేళ్లలో ఏపీ ఫస్ట్ కీలక పురోగతి సాధించాలి" అని దిశానిర్దేశం చేశారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా సంస్థల కరిక్యులమ్‌ను తీర్చిదిద్దడంలోనూ ఈ కేంద్రం సహాయపడాలని స్పష్టం చేశారు.

**డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి**

ఇదే సమావేశంలో డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలన్నారు.

"డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ తరహాలో 'డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్‌మెంట్' వ్యవస్థ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కేంద్రంతో సంప్రదించి పరిశీలించండి," అని అధికారులకు సూచించారు. టెక్నాలజీని ముందుగానే అందిపుచ్చుకోవడం ద్వారా వ్యవస్థలను సిద్ధం చేయాలన్నారు. వచ్చే అంతర్జాతీయ డ్రోన్ దినోత్సవం నాటికి డ్రోన్ల ద్వారా అందించే సేవలను ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపాలని ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పి.ఎస్. రెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# రాష్ట్ర అభివృద్ధి కోసమే మోదీని కలుస్తున్నా-రేవంత్ రెడ్డి

**-బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడి -ప్రజలు అండగా ఉంటే రాష్ట్రాన్ని నెంబర్ వన్ చేస్తానన్న సీఎం**

ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమేనని, కానీ ఎన్నికల తర్వాత అభివృద్ధి కోసం అందరం కలిసి ముందుకు సాగాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వాన్ని కలుస్తామని, సాధ్యమైనంత వరకు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. మోదీ తనకు వ్యక్తిగత బంధువుకాదని, దేశ ప్రధాని కాబట్టే ప్రాంత అభివృద్ధి కోసం ఆయనను కలుస్తున్నానని తెలిపారు. ప్రాంత ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తానని, తనకు వ్యక్తిగత పైరవీలు లేదా స్వార్థ ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు. నిర్మల్ లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ఎంతో ప్రత్యేకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ జిల్లాకు అందాల్సిన న్యాయం, జరగాల్సిన అభివృద్ధి గతంలో సరిగా జరగలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు కూడా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇప్పటివరకు విశ్వవిద్యాలయం లేకపోవడం



దురదృష్టకరమని పేర్కొంటూ, ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలోనే విశ్వవిద్యాలయానికి అధికారిక ఆమోదం వస్తుందని, బాసరలో వర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు అవసరమైన అన్ని నిధులను బడ్జెట్‌లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. తుమ్మడి హెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని, అక్కడే ప్రాజెక్టును నిర్మించి తీరుతామని సీఎం స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం తీసుకొచ్చే పూర్తి బాధ్యత తనదేనని ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శిలాఫలకం వేయిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ మంజూరు చేసినట్లే ఆదిలాబాద్‌కూ ఇస్తామని కేంద్రం చెప్పిందని సీఎం గుర్తు చేశారు. అడిగితేనే అభివృద్ధి వస్తుందని, గత పాలకులు అడగకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. వారి పాలన వల్ల అప్పులు మిగిలాయని, నాడు ఇచ్చిన బియ్యం ఎవరు తిన్నారో తెలియదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యం ప్రజలు తింటున్నారని అన్నారు. సున్నా వడ్డీ పేరుతో గుండు సున్నా మిగిల్చారని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర ప్రజలు అండగా నిలిస్తే దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతానని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసే వారినే గెలిపించాలని కోరారు.

# 'చేయి వీడని చెలిమి' నవలను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యం ఏమాత్రం అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు మంగళగిరికి చెందిన విభిన్న ప్రతిభావంతురాలు చింతక్రింది సాయిజ్యోతి. అంధత్వాన్ని జయించి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని రచయిత్రిగా మారిన ఆమె, తాజాగా 'చేయి వీడని చెలిమి' అనే నవలను రచించారు. ఈ నవలను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సాయిజ్యోతి తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిజ్యోతి అసాధారణ ప్రతిభను, ఆమె కృషిని మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. మంగళగిరి 26వ వార్డుకు చెందిన సాయిజ్యోతి, పుట్టుకతో వచ్చిన అంధత్వంతో ఏమాత్రం కుంగిపోలేదు. మొబైల్ ఫోన్‌లోని వాయిస్ ఇన్ పుట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తనలోని సృజనాత్మకతకు అక్షర రూపం ఇస్తున్నారు. 'చైత్రశ్రీ' అనే కలం పేరుతో ఆమె ఇప్పటికే 'కవితాంజలి' అనే కవితా సంపుటిని, 'మంచుతాకిన ప్రేమ', 'ఎవరు అతను' వంటి నవలలను పాఠకులకు అందించారు. కేవలం కల్పిత కథలే కాకుండా, సామాజిక స్పృహ కలిగించే అనేక కథలను కూడా ఆమె రచించారు. ప్రస్తుతం ఆమె నూతక్కి హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు తనలోని రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శారీరక వైకల్యాన్ని సంకల్ప బలంతో అధిగమించి, తన ప్రతిభతో యువతరానికి సాయిజ్యోతి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని రచయిత్రిగా రాణించడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, సాయిజ్యోతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# ఇంకెంత కాలం విచారిస్తారు

**-దర్యాప్తుకు ప్రభాకర్ రావు సహకరిస్తారని వ్యాఖ్య**
**-ప్రభాకర్‌రావును ఇప్పటికే రెండు వారాల కస్టడీకి ఇచ్చామన్న ధర్మాసనం**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు విచారణపై దర్యాప్తు సంస్థను ధర్మాసనం ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. ఇంకెంత కాలం ఇంటరాగేషన్ కొనసాగిస్తారు? ఈ కేసులో ఇంకా ఏం మిగిలుంది? అంటూ స్పష్టమైన ప్రశ్నలు సంధించింది.

ప్రభాకర్‌రావు ఇంటరాగేషన్‌ను పూర్తిచేయాలని ఆదేశించిన కోర్టు.. మీ ఉద్దేశం పూర్తయిందా? లేదా? మళ్లీ ఆయన్ని జైలుకు పంపాలనుకుంటున్నారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ ఇచ్చినంత మాత్రాన ఆయనను విచారణకు పిలవకూడదని కాదని స్పష్టం చేసింది. అవసరమైతే మళ్లీ పిలిచి విచారణ చేయవచ్చని, ప్రభాకర్‌రావు దర్యాప్తుకు సహకరిస్తారని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కేసు దర్యాప్తును దృష్టిలో ఉంచుకొని ఆర్టికల్ 142 కింద మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు కోర్టు వెల్లడించింది. తదుపరి విచారణ వరకు ప్రభాకర్‌రావుకు ఇచ్చిన మధ్యంతర రక్షణను పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

# భవిష్య వాణి

ప్రస్తుతం వైభవాలు ఎన్నున్నా
భవిష్యత్తు ప్రశ్నార్థకమే...
ఆలోచన సడలి గమ్మత్తుగానున్న
తీసుకున్న నిర్ణయం ఓసారి తప్పేలే...
వికసించిన పుష్పాలు
అతివ కురులలోక
భగవానుని పాదాల చెంతకా
దరిచేరే వరకు చిక్కులేలే...
ఈ జీవితం అంతుచిక్కని ప్రశ్నేలే
అడుగడుగునా గండాలే
ఆశలన్నీ వింతేలే....


కొన్నిసార్లు కొందరి మాటలే దారి చూపిస్తాయి, మరికొన్నిసార్లు చేసిన తప్పులే దారి వేస్తాయి, ఇంకొన్నిసార్లు వచ్చిన అనుభవాలే బ్రతుకు సడలిని మారుస్తాయి, ఈ కోవలోకే చెందుతాయి ముక్కా శ్రీనివాస్ గారి అక్షరాలు, పడినా లేవమని, తగిలిన గాయాన్ని తుడుచుకుని ముందుకు పోమని, బాధపడుతూ అక్కడే కూర్చోకు సాధించేది ముందుంది నడవమని చెప్పకనే చెబుతూ మానవ జీవన విధానానికి కొత్త పునాదులు వేస్తాయి, భారమైన బ్రతుకుకి భరోసానిస్తాయి.

**- ఇక కవిత్వం విషయానికి వస్తే...**

**- శీర్షిక : తెలివితో సాగిపో**

పాతకథకు కొత్తతెలివి భలేకుదిరిందిలే,
తెలివితో తాపాల దాహం తీర్చుకోవచ్చులే.
గమనించడం నేర్చుకుంటే
గమ్యపు దారులు తేలికవ్వునులే,
ప్రయత్నానికి బద్ధకిస్తే
జ్ఞానం వికసించిదులే,
మారుతున్న కాలంతో
మనము మారి వృద్ధిపథంలో సాగాలిలే,
సమయ స్ఫూర్తితో వ్యవహారిస్తూ
వెంటాడే బాధలను
భాగ్యాలుగా మలుచుకోవాలిలే.

లోకం కీర్తించినా ప్రశ్నించినా
శోధనలను వీడొద్దులే,
పరిగెత్తే కాలంలో
కలతల ఒడిలో
నిదురపోవడం తప్పేలే,
పాఠాలు నేర్పేటి జీవితం
నీ పాఠమే పఠియించాలిలే,
అహంకారం వీడి
లోకహితం కోరి
అవరోధాలను అలజడులను అవకాశాలుగా మలుచుకుంటే
దివ్యలోక కాంతి




నీలోనే కనిపించునులే.

**- రచయిత : ముక్కా శ్రీనివాస్**

**- సమీక్ష**

పాత కథలకు కొత్త తెలివి భలే కుదిరిందట, తెలివితో తాపాల దాహం తీర్చుకోవచ్చుట... కాస్త గమనించడం నేర్చుకుంటే గమ్యపు దారులు తేలికవుతాయట, బద్ధకం వదిలేసి ప్రయత్నిస్తే జ్ఞానం వికసిస్తుందట, మారుతున్న కాలంతో పాటు మనము వృద్ధిపథంలో సాగాలట, సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ వెంటాడే బాధలను భాగ్యాలుగా మలచుకోవాలట..
ఎంతటి దృక్కోణమో కదా
ఎంతటి దూరపు చూపో రచయితకు
వాస్తవాలను ముందుగానే గ్రహించి జాగ్రత్త పడమని, కన్నీటిని కనక భాగ్యాలుగా మార్చుకోమని సునాయాసంగా చెప్తున్నారు...
లోకం కీర్తించినా, ప్రశ్నించినా
శోధనలను వీడొద్దని, పరిగెత్తే కాలంలో కలతల ఒడిలో నిదురపోతే జీవిత పాఠాలు నేర్చుకోవడం కష్టమేనని, అహంకారం వీడి లోకహితం కోసం అవరోధాలను, అలజడులను అవకాశాలుగా మార్చుకుంటే దివ్యలోక కాంతి నీలోనే కనిపిస్తుందని ఎంతో ఉన్నతమైన అర్థాన్ని చేకూర్చి గొప్ప ఉపదేశం అందించారు రచయిత...
పాఠకుల మనసుకు కాస్త ఉత్తేజాన్ని రేకెత్తిస్తూ, అబద్ధపు పుటలను అణువణువు ఛిద్రం చేసి, నిజమనే సత్యాన్ని గ్రహించమని, బాధలు శాశ్వతం కావని అన్నిటినీ విడిచి ఉన్నతమైన కీర్తిని ఘనించాలని, జీవిత పాఠాలు నేర్చుకుంటూ, లోకహితాన్ని అవపోసన పట్టాలని, ఆటంకాలను ఎదురీది జీవితంలో కాంతిని ప్రజ్వలిల్లేలా చేసుకోవాలని ఎంతో ఉదారంగా చెప్పారు రచయిత, ఇలాంటి మరెన్నో ప్రేరణాత్మకమైన రచనలు మీ కలం నుంచి పుట్టాలని, మీ అక్షరాలు ఎందరో జీవితాలకు రక్షణగా మారాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**సమీక్ష : భాను తేజశ్రీ పోలగాని**

## జిల్లాస్థాయి అండర్ -17 కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ ట్రోఫీ కైవసం

### - కౌతాళం మండలం ఏరిగేరి జెడ్పిహెచ్ఎస్ స్కూల్

కౌతాళం సింహగర్జన ప్రతినిధి, జనవరి 16
కర్నూలు జిల్లా గడివేముల మండలం చింతకూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాస్థాయి అండర్-17 కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ పోటీలలో జిల్లావ్యాప్తంగా దాదాపు 56 టీములు పాల్గొనగా ఏరిగేరి జట్టు ఆరు మ్యాచ్లు గెలిచి ఫైనల్ కు చేరుకుంది ఫైనల్ మ్యాచ్లో వెలుగోడు జట్టుపై కౌతాళం మండలం ఎరిగేరి జెడ్పిహెచ్ఎస్ స్కూల్ జట్టు 34 -27 పాయింట్లుతో విజయభేరి మోగించి జిల్లాస్థాయి అండర్-17 కబడ్డీ విజేతగా నిలిచి ట్రోపిని అందుకుంది విజేతగా నిలిచిన కబడ్డీ టీం విద్యార్థులకు మరియు కోచ్ రాము సార్ కి స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు గారికి జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## అక్కట్టుకున్న సోషల్ మీడియా గుర్తుల ముగ్గు

### - ఎం.కొట్టాల ముగ్గుల పోటీలో విద్యార్థి అంకిత ప్రయోగం

ఆలూరు: ఆలూరు మండలం ఎం .కొట్టా ల గ్రామం లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పదవ తరగతి విద్యార్థి అంకిత వేసిన సోషల్ మీడియా కు వేదికగా ఉన్న ట్విట్టర్,ఫేస్ బుక్,ఇన్స్టాగ్రామ్,స్నాప్ చాట్,యూట్యూబ్ గుర్తులతో వేసిన ముగ్గు అందరినీ అక్కట్టుకుంది.ముగ్గు క్రింద ప్లీజ్ యూస్ ఇన్ గుడ్ మ్యానర్ అని సందేశం తో రాసింది...

## అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు విజేతలకు బహుమతులు ప్రధానం.

కోడుమూరు సింహగర్జన ప్రతినిధి, జనవరి 16
సి బెళగల్ మండల కేంద్రంలో గ్రామ ప్రజలకు సంక్రాంతి పండుగ సందర్భంగా విష్ణు సేన జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈ ముగ్గుల పోటీలలో పది బహుమతులు ఏర్పాటు చేసినారు మొదటి బహుమతి దాత ఈ గోపాల్ గౌడ్ గెలుచుకున్న రాధికకు 27 వేల రూపాయలు విలువచేసే టీవీ అందజేశారు రెండవ బహుమతి దాత ఎం ధనుంజయ రెండవ బహుమతి గెలుచుకున్న కాచాయినికి 16,500 విలువచేసే వాషింగ్ మిషన్ అందజేశారు మూడవ బహుమతి గెలుచుకున్న జంగం కల్యానికి 15,500 విలువ చేసే ఫ్రిడ్జ్ బహుమతి దాత బి వినోద్ కుమార్ అందజేశారు, నాలుగో బహుమతి గెలుచుకున్న ఈ లక్ష్మికి 11 వేల రూపాయలు ఉషా కూలర్ బహుమతి దాత వడ్డెర సంఘం వారుఅందజేశారు, ఐదవ బహుమతి గెలుచుకున్న సంఘాల గ్రామానికి చెందిన మధుమతికి 9500 బీరువా బహుమతి దాత మీసేవ రామకృష్ణ అందజేశారు, ఆరవ బహుమతి గెలుచుకున్న మాధవికి 6500 సైకిలను బహుమతి దాత బి చికెన్ ఈరన్న అందజేశారు ఏడవ బహుమతి గెలుచుకున్న బి శివమ్మకు 5000 రూపాయల మిక్సర్ బహుమతి దాత పి భీమన్న అందజేశారు, ఎనిమిదవ బహుమతి గెలుచుకున్న కాక్షాయిని కి 3800 డైనింగ్ టేబుల్ ను బహుమతి దాత కె వెల్డింగ్ ఈరన్న అందజేశారు తొమ్మిదవ బహుమతి గెలుచుకున్న శివకుమారికి 3000 రూపాయలు మిక్స్ కుక్కర్ ను బహుమతి దాత టీ ఉపేంద్ర అందజేశారు, మరియు పదవ బహుమతి గెలుచుకున్న తెలుగు దేవాన్ని కి 2700 రూపాయల డిన్నర్ సెట్ ను బహుమతి ధాత హోటల్ వెంకటేశ్వర్లు అందజేశారు, ఈ ముగ్గుల పోటీలు గ్రామంలోని మహిళలు ఎంతో ఉత్సాహంగా తమ ప్రతిభను కనబరిచి ముగ్గులు వేసి బహుమతులు గెలుచుకున్నారు ఈ పండుగ వాతావరణం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు జనసేన నాయకులు గ్రామ ప్రజలు పాల్గొని ఉల్లాసంగా ఈ ముగ్గుల పోటీలను తిలకించారు.



## ఘనంగా బెహన్ కుమారి మాయావతి 70 వ జన్మదిన వేడుకలు

**-ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు మంచాల లక్ష్మీనారాయణ. కర్నూలు జిల్లా అధ్యక్షులు గుదిపి సామెల్. బంగారప్ప పార్టీ నాయకులు పాల్గొన్నారు**



ఎమ్మిగనూరుసింహగర్జన ప్రతినిధి, జనవరి 16
బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు భారత ఉక్కు మహిళ బెహన్ కుమారి మాయావతి 70వ జన్మదిన అనంతపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జె మల్లికల్ రాష్ట్ర కార్యదర్శులు మంచాల లక్ష్మీనారాయణ, గద్దల నాగభూషణం, చిందనూరు నాగరాజు, శ్రీరాములు, అనంతపురం జిల్లా అధ్యక్షులు కాసాని నాగరాజు,కర్నూలు జిల్లా అధ్యక్షులుగుదిపి సామేలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు గద్దల లాజర్, కడప జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, సత్యసాయి జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో బహుజన సమాజం యొక్క హితం కోరి వారిని రాజ్యాధికారం వైపు నడిపించే ఏకైక నాయకురాలు బెహన్ కుమారి మాయావతి అని, ఆమెను ప్రధానిని చేయడమే బహుజనుల ముందున్న లక్ష్యం అని వారు అన్నారు. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పెద్ద ఎత్తున అభ్యర్థులను నిలబెట్టి విజయం సాధించే విధంగా కృషిచేసి స్థానిక సంస్థలలో విజయాన్ని బెహన్ కుమారి మాయావతి కి జన్మదిన కానుకగా ఇవ్వాలని వారు కార్యకర్తలను ఆశభవ వ్యక్తం చేస్తూ వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇన్చార్జ్ బి.వనుమన్న, జి.అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి హెచ్.రామలింగయ్య, వివిధ జిల్లాల నాయకులు, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షులు అంద్రీ బంగారప్ప, మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షులు యస్ లక్ష్మన్న, ఆలూరు నియోజకవర్గ అధ్యక్షులు కొమ్ము రమేష్ మరియు ఆయా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## శ్రీ నీలకంఠేశ్వర జాతర ప్రతిష్టను మంట కలపి అక్రమ వసూల దోపిడీకి పాల్పడుతున్న ఆలయా ధర్మకర్తలు

**-చోద్యం చూస్తున్న ఎండోమెంట్అధికారులుదోపిడి పై స్పందించని మున్సిపల్.కమిషనర్.వ్యాపారస్తుల దగ్గర నుండి బలవంతపు వసూలను ఆపాలనీ ధర్నా: సిపిఐ**




ఎమ్మిగనూరు సింహగర్జన ప్రతినిధి, జనవరి 16
ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి తిరుణాలంటే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఈ జాతరను ఆలయ ధర్మకర్తలు వ్యాపారస్తుల నుండి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని, తక్షణమే దోపిడీ ఆపాలని కోరుతూ శుక్రవారం రోజున సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సోమప్ప సర్కిల్ నందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న,జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో మా ముత్తాతల కాలం నుండి శ్రీనీలకంటేశ్వర స్వామిఆలయధర్మకర్తలమంటూ ఆలయా అభివృద్ధికి సంబంధం లేకుండా ప్రభుత్వానికి, మున్సిపాలిటీ సంబంధం లేకుండా సొంతంగా సామాజిక వర్గ అభివృద్ధికి అంటూ ఆర్థిక దోపిడీ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. జాతర సందర్భంగా తేరు బజార్ లో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక వ్యాపార దుకాణాలు నిర్వాహకుల దగ్గర నుండి గతంలో ఉన్న దానికన్నా రెట్టింపు గా పెంచుతూ గజం స్థలానికి 2000 నుండి 8000 రూపాయల వరకు పెంచుతూ వ్యాపారస్తుల దగ్గర నుండి ముక్కు పిండి బలవంతపు వసూలు చేయడం చాలా దారుణమని వారు తెలిపారు. నీలకంఠేశ్వర స్వామి ఆలయం ఎండోమెంట్లకు పోయినప్పటికీ కోర్టుకెళ్లి స్టే పేరుతో ఆలయ ధర్మకర్తలు ఇస్తానుసారంగా వసూలు చేయడం జరుగుతుందని, నీలకంటేశ్వర రథం నుండి మార్కండేయ ఆలయం వరకు 100 ఫీట్స్ రోడ్డుతో 2800 గజాలు ఉందని ఈ విధంగా లెక్కేస్తే 40 లక్షల నుండి 50 లక్షల మధ్య వరకు వసూలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. తేర్ బజార్ స్థలాన్ని మా తాతలు ఇచ్చారు కాబట్టి మేం వసూలు చేసుకుంటామంటూ ధర్మకర్తలు చెప్పడం సిగ్గుచేటని,ఇంత జరుగుతున్న మున్సిపల్ కమిషనర్ వసూలు పై స్పందించకపోవడం పలు అనుమానాలకుదారితీస్తుందనిప్రజలుచర్చించుకుంటున్నారని వారు తెలిపారు.కాబట్టి ఇప్పటికైనా చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే ఆలయధర్మకర్తలుఆలోచించాలని ఈ జాతర పరువు ప్రతిష్ట ను మంట కలుపుకుండా కాపాడాలని, అక్రమ వసూలు తక్షణమే ఆపాలని లేనిపక్షంలో ఆలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని వారిచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమయుల్లా, సిపిఐ మండల కార్యదర్శి రాజీవ్, సిపిఐ నాయకులు తిమ్మ గురుడు, విజయేంద్ర, మల్లికార్జున గౌడ్,మాలిక్,కాజా,ఇస్మాయిల్,వెంకటేష్,హనుమంతు ,నరసింహులు, రంగస్వామి,ఎల్లప్ప,రవి, నాగరాజు,సుంకన్న, దస్తగిరి,అమృత రాజు, నరసప్ప,తదితరులు పాల్గొన్నారు

# వృద్ధులకు అన్నదానం నూతన వస్త్రాలు పంచిన కుడిపూడి




తాళ్లరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 16 : సంక్రాంతి సందర్భంగా ప్రతి సంవత్సరం పి.మల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలోగల వృద్ధ మహిళలు, వితంతువులకు భోజనం పెట్టి నూతన వస్త్రాలు ఇచ్చి గౌరవించే మంచి మనసు కలిగిన పి.మల్లవరం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రదాత, రెండు పర్యాయములు సర్పంచ్ గా పనిచేసి ఉత్తమ సర్పంచ్ గా అవార్డు పొంది ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ దంపతుల కుమారుడు శ్రీనివాస్ దంపతులు ఈ సంవత్సరం 2026లో కూడా అందరికీ భోజనం పెట్టి, నూతన వస్త్రాలు అందించిన సందర్భంగా నీలపల్లి గ్రామ సర్పంచ్ చిట్టూరి నాగమణి భర్త చిట్టూరి కల్కి మూర్తి మాట్లాడుతూ ఆయన మహాదాత అని, ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాలు నిర్వహించి అనేకమంది ప్రాణాలు కాపాడారని, పేద విద్యార్థులు అనేకమంది చదువుకోవడానికి, పేదలకు వివాహ సమయాల్లో, పేదల గృహనిర్మాణానికి, అనారోగ్యంతో బాధపడే వారికి ఆర్థిక సహాయాలు మరియు కరోనా సమయంలో ఈయన స్వయంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం వంటి అనేక సహాయ కార్యక్రమాలు చేసే మహాదాత అని కొనియాడారు. ఈ సందర్భంగా పి.మల్లవరం గ్రామపంచాయతీ ప్రజలు కుడిపూడి శివన్నారాయణని దీవించి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో కలకాలం ఉండాలని తెలియజేస్తూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు జిల్లా ప్రకటించాలని 13వ రోజు కొనసాగిన దీక్షలు

### -కళ్లకు గంతలు కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపిన జేఏసినాయకులు

ఎమ్మిగనూరు జనవరి 16 సింహగర్జన ప్రతినిధి, జనవరి 16
ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు జిల్లాపై తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రాత్మకంఎమ్మిగనూరు ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఎమ్మిగనూరు ప్రధాన కూడలిలో 13వ రోజు దీక్షలు కొనసాగాయి. ప్రభుత్వము స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఈ ఉద్యమం ఆగదని జేఏసీ నాయకులు తెలిపారు. ఎమ్మిగనూరు ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి కోసం ఎమ్మిగనూరు జిల్లా ప్రకటనపై ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఒక చారిత్రాత్మకమని జేఏసీ నాయకులు హర్షించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాలలోపుఎమ్మిగనూరుజిల్లాపైముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతాను అని తెలపడం ఎమ్మిగనూరు ప్రజలపై ఉండే ప్రేమ అభిమానాన్ని ఎమ్మెల్యే మరోసారిచాటుకున్నారు.ముఖ్యంగా ఎమ్మిగనూరు జిల్లా ప్రకటనలో ప్రధానమైన అంశము ప్రభుత్వ ఆర్థిక భారాన్ని తగ్గించడమే అని జేఏసీ నాయకులు తెలిపారు. వేల ఎకరాల ప్రభుత్వ భూములు మరియు తాగునీటి వనరులు కర్నూలు నుండి ఆలూరు చివరి అంచల వరకు మధ్యలో ఉండే ప్రాంతం మత ఘర్షణలు లేని శాంతియుత వాతావరణమున్న ప్రాంతం ఎమ్మిగనూరు అని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ అర్హతలు ఏనియోజకవర్గానికి ఉన్న ఆ నియోజకవర్గాన్ని ప్రభుత్వం జిల్లా చేయడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదని జేఏసీ నాయకులు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా దశలవారీగా ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వం దిగొచ్చేంత వరకు కూడా ఈ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేష్ రంగయ్య చార్లెస్ చిన్ని ప్రసాద్ రాము రాజోలప్ప గోవిందమ్మ బతుకమ్మ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# బాట సుంకులమ్మ ఆలయంలో రూ.46.30 లక్షలకు టెంకాయల వేలం

గుత్తి, సింహగర్జన ప్రతినిధి, జనవరి 16
గుత్తి మండలం బాచుపల్లి సమీపంలోని ప్రసిద్ధ బాట సుంకులమ్మ దేవాలయంలో టెంకాయల విక్రయ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగ వేలం భారీ ధరను పలికింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ వేలం ప్రక్రియ ఉత్కంఠభరితంగా, పోటీగా సాగింది.
వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు వ్యాపారులు వేలంలో పాల్గొనగా, చివరకు వన్నెదొడ్డి గ్రామానికి చెందిన మద్దయ్య రూ.46.30 లక్షల భారీ మొత్తానికి టెంకాయల విక్రయ హక్కులను దక్కించుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుత సంక్రాంతి పండుగ నుంచి వచ్చే ఏడాది సంక్రాంతి వరకు ఆలయ ప్రాంగణంలో టెంకాయలు విక్రయించే అధికారం ఆయనకు లభించింది.స్థానిక పోలీసులు, సీఐ రామారావు పర్యవేక్షణలో వేలం పాట ప్రశాంతంగా నిర్వహించగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఈ క్షేత్రంలో వేలం ద్వారా ఆలయానికి భారీ ఆదాయం సమకూరినట్లు వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వ.ఆసుపత్రి.డాక్టర్లతో సమీక్ష. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు సింహగర్జన ప్రతినిధి, జనవరి 16
ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (జుజ) ఆసుపత్రిని సందర్శించి, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ (ఎఱజ)సమీక్షాసమావేశంలో పాల్గొన్నారుఈ సమావేశంలో ఆసుపత్రిని ప్రస్తుతం ఉన్న 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం, అధికంగా ప్రసవాలు చేయడం, గుండెపోటు మరియు హార్ట్ స్ట్రోక్ కేసులకు తక్షణ చికిత్స వంటిఅంశాలపైవిస్తృతంగాచర్చించారు.ప్రత్యేకంగా ూజువీ× ప్రోగ్రామ్ కింద గుండెపోటు బాధితులకు అందించాల్సిన టెనెక్టేస్ (ూవఅవష్ఝుంవ) ఇంజెక్షన్లు (ఒక్కోటి రూ.40,000 రూ.50,000 విలువైనవి) నిరంతరం అందుబాటులో ఉండేలాచర్యలుతీసుకోవాలనిఅధికారులనుఆదేశించారు.అలాగే ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లు, నర్సులు మరియు ఇతర సిబ్బంది ఖాళీలను తక్షణమే భర్తీ చేయడం, అవసరమైన వైద్య పరికరాలను సిఎస్ఆర్.నిధులద్వారాసమకూర్చడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి.మాట్లాడుతూఎమ్మిగనూరు సి.హెచ్.సి. ఆసుపత్రిని అత్యవసర వైద్య సేవలు అందించే కేంద్రంగతీర్చిదిద్దుతామని, ముఖ్యంగా క్రిటికల్ కేసులకు తక్షణ స్పందన ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న డాక్టర్లు మరియు వైద్య సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో హెచ్. డి సి సభ్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఏఎంసీ చైర్మన్, స్థానిక నాయకులు, ఆసుపత్రి సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు









# వనదుర్గమ్మ వారి ఆలయంలో ఘనంగా చండీ హోమం

అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 16 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువైయున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీ హోమము ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యహ వచనం, అమ్మవారికి మూల మంత్ర జపములు, సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11 గంటలకు పూర్ణహూతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు మరియు వేదపండితులు తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుడ్ని దర్శించుకున్న అడిషనల్ డీజీపీ ఎన్.సుబ్రహ్మణ్యం



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 16 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారిని అడిషనల్ డీజీపీ ఎన్.సుబ్రహ్మణ్యం కుటుంబ సమేతముగా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేయగా, దేవస్థానం అధికారులు శ్రీ స్వామివారి శేష వస్త్రమును, శ్రీ స్వామివారి ప్రసాదమును, శ్రీ స్వామివారి చిత్ర పటమును అందజేశారు.

# రైతులకు నాణ్యమైన ధర కల్పించడమేకుటమి ప్రభుత్వ ధ్యేయం

### -ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు సింహగర్జన ప్రతినిధి, జనవరి 16 ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి గారు సందర్శించి, ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ అధినాయకులు గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి శ్రీ నారాలోకేష్ .చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు కి ప్రత్యేక కృతజ్ఞతలుతెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయమైన మద్దతు ధర లభించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు. పంటలకు గిట్టుబాటుధరకల్పించడం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచే కొనుగోళ్లు జరిపి రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అనిపేర్కొన్నారు.అన్నదాత సుఖీభవ" ఇన్పుట్ సబ్సిడీలు, ఉల్లి పంటలకు ఊరటగా నష్ట పరిహారం, మద్దతు ధర కొనుగోళ్లు వంటి పథకాల ద్వారా రైతులసంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వంనిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ మార్కెట్ కమిటీ చైర్మన్, టౌన్ బ్యాంక్ చైర్మన్, ఏఎంసీ చైర్మన్ పట్టణ మరియు మండల నాయకులు, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సి.యస్.పురం శివాలయంలో హుండీ చోరీ



మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 16 : మండల కేంద్రమైన సి.యస్.పురంలోని శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీ చోరీకి గురైన సంఘటన జరిగింది. రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో ఆలయ పూజారి గుడి ప్రాంగణంలోకి వెళ్ళగా అక్కడ హుండీ పగలగొట్టినట్లు గుర్తించారు విషయాన్ని వెంటనే సమీపంలో ఉన్నటువంటి గ్రామస్తులకు పూజారి తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు హుండీలో దొంగతనం గురించి స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇచ్చారు. ఎస్సై వెంకటేశ్వర నాయక్ శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఒడియ రాజుల నగర్ కు చెందిన బండారు రాంప్రసాద్ అనే వ్యక్తిని పట్టుకోవడం జరిగింది. అతను దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించి అతని వద్ద నుండి రూ.64 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



# తస్మాత్ జాగ్రత్త

### -లింకులు క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ

### -సైబర్ మోసాలపై ఎస్సై వెంకటేశ్వర్ల నాయక్ సూచన

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 16 : వాట్సాప్ గ్రూపుల్లో ఇటీవల 'నాకు రూ.5 వేలు వచ్చాయి.. నమ్మలేకపోయాను.. మీరు కూడా ట్రై చేయండి....' అంటూ వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని మార్కాపురం జిల్లా సి.యస్.పురం మండలం ఎస్సై వెంకటేశ్వర్ల నాయక్ ప్రజలకు తెలియజేశారు. ఇలాంటి మెసేజ్ల ద్వారా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి, బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కొల్లగొడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయకుండా ఉండాలని ఎస్సై సూచించారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చర్యల వల్ల మొబైల్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉండటంతో పాటు, ఖాతాల నుంచి డబ్బులు పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద లింకులు వస్తే వెంటనే వాటిని డిలీట్ చేసి, అవసరమైతే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ ప్రజలను హెచ్చరించారు




# జై భీమ్ పేట గ్రామంలో సంక్రాంతి సంబరాలు



తాళ్లరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 16 : తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ జై భీమ్ పేట గ్రామంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా బాల బాలికలకు వివిధ ఆటల పోటీలు మరియు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గెలుపొందిన వారికి జనసేన నాయకులు ఎలిపే నాగేశ్వరరావు బహుమతులు స్పాన్సర్ చేసి గెలుపొందిన వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎలిపే నాగేశ్వరరావు మాట్లాడుతూ ముందుగా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు విద్యార్థుల శారీరక వికాసానికి, మానసిక వికాసానికి తోడ్పడతాయని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని అభివృద్ధి దిశలో పయనించాలని, తద్వారా మీ ఇంటికి, గ్రామానికి, దేశానికి, మంచి పేరు తెచ్చి ఉత్తమ పౌరులుగా మెలగాలని నేటి బాలలే రేపటి పౌరులని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జనసేన కార్యకర్తలు దడాల సత్తికొండ, ఎలిపే వెంకటేష్, బండి బాలరాజు, పంతగడ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, వీర మహిళలు, ప్రజలు, పాల్గొని నాగేశ్వరరావుకి బహుమతులు స్పాన్సర్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.






# కలసి వచ్చిన సంక్రాంతి సెంటిమెంట్

## -అనిల్ రావిపూడి, శర్వానంద్‌లకు పండగే పండగ

సంక్రాంతికి హిట్ కొట్టడం వేరు....అలాంటిది ఆ పండగకు వచ్చిన ప్రతిసారి విజయం అందుకున్నారు హీరో శర్వానంద్, డైరెక్టర్ అనిల్ రావిపూడి. పొంగల్ రిలీజ్.. అనిల్‌కు సెంటిమెంట్‌గా మారింది. వీలుంటే ప్రతి ఏడాదీ పండగకు వస్తాననంటుంటారు. సంక్రాంతికి వచ్చిన సినిమాలే కాదు అనిల్ తెరకెక్కించిన ఇతర సినిమాలన్నీ హిట్ అయిన సంగతి తెలిసిందే.సంక్రాంతికి తమ సినిమాలను రిలీజ్ చేయాలని ఎంతోమంది మేకర్స్ ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కానీ, అది కొన్నిసార్లు వర్కౌట్ కాదు. దీంతో, కొన్ని సినిమాలు అకస్మాత్తుగా విడుదలవుతుంటాయి. సాధారణ రోజుల్లో పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయంటే.. చిన్న చిత్రాల మేకర్స్ వాటిని విడుదల చేసేందుకు సాహసించరు. పెద్ద పండగకు తప్పని సరిగా ప్రేక్షకులు ఆశీర్వదిస్తారన్న నమ్మకంతో రిలీజ్ చేస్తుంటారు. అలా ఈ ఏడాది విడుదలైన ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి సినిమా, రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో పాటు శర్వా మూవీ, నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సందడి చేస్తున్నాయి.సంక్రాంతి సందర్భంగా 'ఎక్స్‌ప్రెస్ రాజా'తో 2016లో శర్వా తొలి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ప్రేమించిన అమ్మాయి పెంచుకున్న కుక్క కనిపించకపోవడంతో.. దాన్ని వెతికి పట్టుకునే క్రమంలో హీరోకి ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి? అన్న పాయింట్‌తో మేర్లపాక గాంధీ తెరకెక్కించిన రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ ఇది. మరుసటి ఏడాది సంక్రాంతికి 'శతమానం భవతి'తో అంతకుమించిన సక్సెస్ చూశారు శర్వానంద్. కుటుంబ విలువలు గుర్తుచేసేలా సతీశ్ వేగేశ్న తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామా ఇది. ఈ ఏడాది 'నారీ నారీ నడుమ మురారి' గా నవ్వులు పంచారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయే యువకుడి కథాంశంతో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ సినిమా థియేటర్లలో నవ్వులు పూయిస్తోంది. ఈ మూడు సినిమాలు జనవరి 14న విడుదల కావడం విశేషం.

ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా సినిమాలు చేస్తూ వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేశ్, వరుణ్‌తేజ్ కాంబినేషన్‌లో ఆయన తెరకెక్కించిన 'ఎఫ్ 2' 2019 జనవరి 12న రిలీజైంది. ఈ మూవీ రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. 2020 జనవరి 11న విడుదలైన మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు' దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. 2025 జనవరి 14న విడుదలైన వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఏకంగా రూ.300 కోట్లు వసూలు చేసి, ఈ హీరో- దర్శకుడి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నెల 12న విడుదలైన చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్‌గారు' సైతం జోరు ప్రదర్శిస్తోంది. మూడు రోజుల్లోనే రూ.152 కోట్లు కలెక్ట్ చేసింది.

# ఆగని దురంధరన్ దూకుడు

## 15న ఒక్కరోజే మూడుకోట్ల వసూళ్లు

రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ బాక్సాఫీస్ వద్ద తన జోరు ఇంకా తగ్గించలేదు. విడుదలై ఆరు వారాలు పూర్తయినా, ఈ సినిమా కలెక్షన్ల పరంగా రోజుకో కొత్త రికార్డును నమోదు చేస్తూ ఇండియన్ సినీ పరిశ్రమలో అరుదైన ఘనతలు సాధిస్తోంది. ముఖ్యంగా విడుదలైన 42వ రోజున కూడా భారీ వసూళ్లు రాబట్టి సినీ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇండియన్ సినిమాల చరిత్రలో 42వ రోజున అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ధురంధర్ నిలవడం విశేషం. జనవరి 15న

మాత్రమే ఈ చిత్రం సుమారు రూ.3 కోట్ల నికర వసూళ్లు సాధించింది. ఇంతకు ముందు ఈ రికార్డు ఛావా (రూ.1.35 కోట్లు) పేరిట ఉండగా, దాన్ని భారీ తేడాతో ధురంధర్ బ్రేక్ చేసింది. ఈ సినిమా థియేటర్లలోకి వచ్చిన మొదటి రోజు నుంచే బలమైన పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. రూ.28 కోట్ల ఓపెనింగ్‌తో మొదలైన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే వంద కోట్ల మార్క్‌ను దాటేసింది. మొదటి వారాంతం ముగిసే సరికి దాదాపు రూ.103 కోట్ల వసూళ్లు నమోదు చేసి ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తొలి వారం మొత్తం కలెక్షన్లు రూ.207 కోట్లకు పైగా ఉండటం ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపించింది. రెండో వారం వచ్చాక కూడా గ్రాఫ్ పడిపోకుండా మరింత బలంగా నిలిచింది. ముఖ్యంగా వీకెండ్లలో ప్రేక్షకుల తాకిడి పెరగడంతో 9వ, 10వ రోజుల్లో రికార్డు స్థాయి వసూళ్లు నమోదయ్యాయి. రెండో వారం ముగిసే సరికి మరో రూ.250 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయి. ఆ తర్వాత మూడో, నాలుగో వారాల్లోనూ సినిమా స్థిరమైన రన్ కొనసాగిస్తూ వరుసగా రూ.172 కోట్లు, రూ.106 కోట్లకు పైగా వసూలు చేసింది. ఐదో వారం, ఆరవ వారాల్లో కొత్త సినిమాల పోటీ ఉన్నప్పటికీ ధురంధర్ తన స్క్రీన్లను నిలబెట్టుకుని మంచి వసూళ్లు రాబట్టింది. 39వ రోజు నుంచి 42వ రోజు వరకూ రోజుకు రూ.2 నుంచి 3 కోట్ల మధ్య కలెక్షన్లు రావడం ఈ సినిమాకు లభించిన అరుదైన ఘనతగా చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు దేశీయంగా ఈ చిత్రం దాదాపు రూ.817 కోట్ల నికర వసూళ్లు నమోదు చేయగా, భారతదేశ గ్రాస్ కలెక్షన్లు రూ.976 కోట్లకు చేరుకున్నాయి. అదే సమయంలో ఓవర్సీస్ మార్కెట్లలో కూడా రూ.293 కోట్ల వరకు వసూలు చేసి, మొత్తం ప్రపంచవ్యాప్తంగా రూ.1,270 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించింది. మొత్తంగా చూస్తే, ధురంధర్ కేవలం ఒక హిట్‌గా మాత్రమే కాకుండా, దీర్ఘకాలం బాక్సాఫీస్‌పై ఆధిపత్యం చూపిన అరుదైన ఇండియన్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇంకా థియేటర్లలో కొనసాగుతున్న ఈ సినిమా రన్ చివరికి ఎక్కడ ఆగుతుందో చూడాల్సిందే.




# ప్రభాస్ నిమ్మల "మిరాకిల్" ఫస్ట్ లుక్ విడుదల

## - రణధీర్ భీసు-హెబ్బా పటేల్ జంటగా సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రల్లో ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్టైనర్'గా

హైదరాబాద్, సింహగర్జన ప్రతినిధి, జనవరి 16 : సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై రమేష్ ఎగ్గిడి - శ్రీకాంత్ మొగదాసు - చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్టైనర్ "మిరాకిల్". "సత్య గ్యాంగ్, ఫైటర్ శివ" చిత్రాల దర్శకుడు ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్ సంక్రాంతి కానుకగా ఈరోజు (జనవరి 16న) విడుదల చేశారు. జ్యోత్స్న ఈ చిత్రానికి సహ నిర్మాత. పోరాట సన్నివేశాలతో మొదటి షెడ్యూల్ జరుపుకున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ ఈనెల 22 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరగనుంది. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బా పటేల్ హీరోయిన్. అక్షర నున్న సుజన మరో హీరోయిన్. సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నాయుడు పెంద్ర విలన్ గా పరిచయమవుతున్నాడు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్ గా నటిస్తున్న ఈ చిత్రంలో జనార్దన్, యోగి కాత్రే, విజయ్ సూర్య, ఇంతియాజ్, సాయిబాబా, దిల్ రమేష్, ఝాన్సీ, సూర్యనారాయణ, శ్రీధర్, శ్రీకాంత్, శివ, ఆమని, హైమావతి, నవ్య (అమ్ము) బెజవాడ మస్తాన్, ఆర్. కుమార్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "సత్యా గ్యాంగ్, ఫైటర్ శివ" చిత్రాలతో దర్శకుడిగా తన సత్తా చాటుకున్న ప్రభాస్ నిమ్మల తన మూడో చిత్రంతో "మిరాకిల్" చేయబోతున్నారు. హెబ్బా పటేల్ గ్లామర్, సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ పోషిస్తున్న కీలక పాత్రలు, ముఖ్యంగా యాక్షన్ బ్లాక్స్ "మిరాకిల్" చిత్రానికి ముఖ్య ఆకర్షణలు కానున్నాయి. రెండో షెడ్యూల్ ఈనెల 22 నుంచి జరగనుంది" అని అన్నారు. ఈ చిత్రానికి పి.ఆర్.ఓ : ధీరజ్-అప్పాజీ, కెమెరా : సురేందర్ రెడ్డి, ఎడిటింగ్ : విశ్వనాథ్, లిరిక్స్ : రాంబాబు గోసాల, ఫైట్స్ : శ్రీను, సహనిర్మాత : జ్యోత్స్న, నిర్మాతలు : రమేష్ ఎగ్గిడి - శ్రీకాంత్ మొగదాసు - చందర్ గౌడ్, కథ-మాటలు-స్క్రీన్ ప్లే-సంగీతం-దర్శకత్వం : ప్రభాస్ నిమ్మల.






Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com